



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 362 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 1 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :362 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 1 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

- విశాఖ జిల్లాలో నారా లోకేశ్ పృటన
- హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆలయాన్ని సందర్శించిన మంత్రి
- హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ
- ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనం ప్రారంభం
- జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌కు ప్రారంభోత్సవం



పెన్ పవర్ డెస్క్:"ఒక వ్యక్తి చేసిన దానం.. నేడు వేల మందికి నీడనిచ్చే మహావృక్షంగా మారింది. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ ప్రాంగణమే ఒక చక్కటి ఉదాహరణ" అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇవాళ విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో ఆయన పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని, ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థకు సహకరిస్తున్న ముఖ్య దాతలతో బోర్డ్‌రూమ్ సమావేశంలో పాల్గొన్నారు.

- మిగతా 2లో



## పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- ప్రజల అభిప్రాయాలు, డేటా ఆధారంగా పౌరసేవలు మెరుగుపరచాలని సీఎం ఆదేశం
- పారిశుధ్యంపై రాజీ లేదని, సంక్షేమ హాస్టళ్లలో నెలకోసారి పేరెంట్స్ మీటింగ్ పెట్టాలని సూచన
- ప్రభుత్వ శాఖల సేవలు, ధ్రువపత్రాల జారీ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరగాలని నిర్దేశం
- వెలిగొండ తరహాలో ప్రతి కార్యక్రమంలో ప్రజా భాగస్వామ్యం పెంచాలని పిలుపు
- నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని సద్వినియోగం చేసుకోవాలని ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, డేటా అనలటిక్స్‌ను విశ్లేషించడం ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌరసేవలను మరింత మెరుగుపరచాలని, అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతిలోని

- మిగతా 2లో






# కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర

- వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి కృష్ణా జలాలను విడుదల చేసిన సీఎం చంద్రబాబు
- పంచెకట్టులో కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు, హారతి.. సాష్టాంగ నమస్కారం
- రాబోయే తరాల కోసం పనిచేస్తా, ఓట్ల కోసం కాదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి
- ఇక మార్కాపురం టైం మొదలైందని, ఈ ప్రాంతం అన్‌స్టాపబుల్ అని వ్యాఖ్య
- ఉద్యమకారుడు పూలసుబ్బయ్య కుటుంబ సభ్యులను సత్కరించిన చంద్రబాబు

వెలిగొండ బంగారు కొండ అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలంలో వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను జాతికి అంకితం చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు."మాట ఇచ్చాను.. నిలబెట్టుకున్నాను. పునాది వేశాను.. ప్రాజెక్టును పూర్తి చేశానని సగర్వంగా చెబుతున్నాను. ఇది నా అదృష్టం. 30 ఏళ్ల క్రితం 1996లో ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశాను. 30 ఏళ్ల తర్వాత మొదటి దశ ప్రారంభించి జాతికి అంకితం చేశాను.

- మిగతా 2లో








## పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

పెన్ పవర్ డెస్క్: రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం, అటవీ, పర్యావరణశాఖల మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పరిశ్రమలన్నీ పర్యావరణ నిబంధనలను తప్పక

- మిగతా 2లో

## రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

- సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వైఎస్ జగన్ పులివెందుల పర్యటన
- వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్
- ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తండ్రికి నివాళులు
- పర్యటనలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండనున్న మాజీ సీఎం

- మిగతా 2లో





## సింధు జలాలపై తీర్పు.. కోర్టుకు ఆ పరిధిలేదన్న భారత్

- సింధు జలాల ఒప్పందంపై హేగ్ కోర్టు తీర్పును తిరస్కరించిన భారత్
- ఆ కోర్టుకు తమపై ఎలాంటి అధికారం లేదని స్పష్టం
- కోర్టు ఏర్పాటు చట్టవిరుద్ధమని పేర్కొన్న విదేశాంగ శాఖ
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్
- తీర్పుతో తమ ప్రాజెక్టులపై ప్రభావం ఉండదని వెల్లడి

పెన్ పవర్ డెస్క్: సింధు జలాల ఒప్పందంపై ప్రపంచబ్యాంక్ ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కోర్టు ఇచ్చిన తీర్పును భారత్ తోసిపుచ్చింది. ఈ న్యాయస్థానం చట్టవిరుద్ధంగా ఏర్పాటైనదిగా పేర్కొంది. సింధు జలాల ఒప్పందం తాత్కాలిక నిలుపుదల కొనసాగుతుందని స్పష్టంచేసింది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం సింధు జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రపంచ

- మిగతా 2లో

## యూపీలో విషాదం.. బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుళ్లు, 11 మంది మృతి

- యూపీలోని కౌశాంబిలో బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం
- 11 మంది మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం NDRF, SDRF బృందాల సహాయక చర్యలు
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్‌గ్రేషియా
- ఘటనపై సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి, బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం



పెన్ పవర్ డెస్క్:ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ బాణాసంచా ఫ్యాక్టరీలో

- మిగతా 2లో



## రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?

### కూనంనేని సంచలన వ్యాఖ్యలు

- మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలన్న కూనంనేని
- స్వేచ్ఛ లేకపోతే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని హెచ్చరిక
- సీఎంపై వ్యక్తిగత విమర్శలు సరికాదని కొండా సుస్మితకు సూచన
- రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు ఉండాలన్న కూనంనేని
- కోటి ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని వెల్లడి

- మిగతా 2లో



## విజయ్ ప్రధాని అభ్యర్థిత్వం రగడ.. కాంగ్రెస్, డీఎంకే నేతల ఫైర్

- 2029లో విజయ్ ప్రధాని అభ్యర్థి అంటూ టీవీకే ప్రచారం
- దీనిపై డీఎంకేతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం
- మా పీఎం అభ్యర్థి రాహుల్ గాంధీనేనని స్పష్టం చేసిన కాంగ్రెస్

- మిగతా 2లో





## ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ..

### యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి చర్చలు

- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో మోదీ భేటీ
- యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి సమావేశం
- హర్మూజ్ జలసంధిపై చర్చ జరిగి ఉండొచ్చని అంచనా
- ఇరాన్ యుద్ధం కోరుకోవడం లేదన్న పెజెష్కియాన్
- అర్మేనియా ప్రధాని పషిన్యాన్‌తోనూ మోదీ భేటీ

- మిగతా 2లో

కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

## ఎడిటర్ వ్యూ

# ఒక్కరి దానం.. వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

### సేవే పరమావధిగా సాగిన జీవితం

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. దివంగత 'పద్మశ్రీ' డాక్టర్ ఎస్.వి. ఆదినారాయణరావు గారు, వారి కుటుంబం సమాజ సేవ కోసం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆ భూమిలో నేడు కాలేజీ, హరేకృష్ణ మిషన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం, వృద్ధుల సంరక్షణ కేంద్రం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కొనియాడారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్న ఈ రోజుల్లో, వృద్ధుల కోసం అత్యాధునిక కేర్ సెంటర్ నిర్మించడం గొప్ప విషయమని ప్రశంసించారు.

### విలువలతో కూడిన విద్యే లక్ష్యం

"విద్యాశాఖ మంత్రిగా విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా, విలువలు, నైతికతతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత నాపై ఉంది. 'అమ్మకి చెప్పలేని పని ఏదీ చేయొద్దు' అనే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి మాట ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం కావాలి. అందుకే ఆయనకు కేబినెట్ హోదాతో సలహాదారు బాధ్యతలు అప్పగించాం. ఆయన సూచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన పుస్తకాలను అందిస్తాం" అని లోకేశ్ వివరించారు. వృద్ధులు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి రూ. 4,000 పెన్షన్ అందిస్తున్నారని గుర్తు చేశారు.

### విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "రాష్ట్ర విభజన తర్వాత విశాఖ అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్లుగా విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో విశాఖను దేశంలోనే నంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేసిన తరహాలోనే విశాఖ అభివృద్ధిలోనూ కొత్త బెంచ్‌మార్క్ సృష్టిస్తామని అన్నారు.

### అపోహలు వద్దు.. పర్యావరణ పరిరక్షణే ముఖ్యం

అభివృద్ధి విషయంలో ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని లోకేశ్ అన్నారు. "ప్రజల ప్రయోజనాలకు, ప్రకృతికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేపట్టదు. డేటా సెంటర్ల విషయంలో కొన్ని అపోహలున్నాయి. నేను వ్యక్తిగతంగా ఇంటెల్ డేటా సెంటర్‌ను పరిశీలించాను. విశాఖలో ఏర్పాటు చేసే డేటా సెంటర్లలో నీటి వినియోగాన్ని తగ్గించే ఎయిర్ కూలింగ్ వంటి ఆధునిక సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తాం" అని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అన్ని విషయాల్లో పర్ఫెక్ట్ అని చెప్పడం లేదని, ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, అవసరమైన చోట సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, ఫౌండేషన్ ఛైర్మన్ రొక్కమ్ శశి ప్రభ, హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిస్కించన భక్త దాస తదితరులు పాల్గొన్నారు.

# యూపీలో విషాదం.. బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుళ్లు, 11 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

చెలరేగిన మంటలు వరుస పేలుళ్లకు దారితీయడంతో 11 మంది సజీవ దహనం అయ్యారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పిప్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మనౌరి బజార్‌లో జరిగిన ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ శర్మ కథనం ప్రకారం, ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికార యంత్రాంగం, పోలీసు బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (చీణ=ఖీ), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ాణ=ఖీ) బృందాలను రంగంలోకి దించారు. ఇప్పటివరకు 11 మృతదేహాలను వెలికితీసినట్లు ఆయన ధ్రువీకరించారు. గాయపడిన ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం ప్రయాగ్‌రాజ్‌లోని స్వరూప్ రాణి నెహ్రూ (ా=చీ) ఆసుపత్రికి తరలించారు. పేలుళ్ల తీవ్రతకు ఫ్యాక్టరీ భవనంతో పాటు సమీపంలోని కొన్ని నిర్మాణాలు కూడా కుప్పకూలాయి. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకొని ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ దుర్ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మేజిస్ట్రేట్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, వారి ఆస్తులను జప్తు చేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ. 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన పలువురు ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని అన్నారు. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి వర్గాలకు సూచించారు. ప్రమాద స్థలంలో బంధువులు తమ వారి కోసం శిథిలాల మధ్య వెతుకుతున్న దృశ్యాలు, ఆసుపత్రుల వద్ద ఆత్మీయుల సమాచారం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు అక్కడి పరిస్థితికి అద్దం పట్టాయి.

# కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర: సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

నాడు చేసిన సంకల్పం.. నేడు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం.. కొండలు వస్తే తొలిచి ముందుకెళ్లాం. ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన ప్రజలకు పాదాభివందనం చేస్తున్నాను. నిర్వాసితులు కూడా సంతోషంగా ఉండాలనేది నా ఆకాంక్ష. ఆర్థికంగా కష్టాలున్నా.. ఎక్కడా వెనకడుగు వేయలేదు. వాన కోసం ఆకాశం వైపు చూసిన రైతుల బాధలు చూశాం. బోరు వేస్తే నీళ్లు పడక అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబాలను చూశాం. పనులు దొరక్క ఊరు విడిచి వెళ్లిన కూలీలను చూశాం. ఇక ఆ పరిస్థితులు ఉండవు.

ఫ్లోరైడ్ అనే పదం మరచిపోతాం. 2019లో గొడ్డలి పార్టీ రాకతో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టింది. 2024లో వెలిగొండకు పట్టిన గ్రహణం వీడింది. గత ప్రభుత్వంలో కేవలం 2.77 శాతమే పనులు చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి చెల్లింపులతో మోసం చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశామని డ్రామాలాడారు. ఫేక్ ప్రచారాలతో కరవు రైతుల జీవితాలతో ఆడుకున్నవారిని ఏమనాలి? ప్రధాని మోదీ సాయం.. మిత్రుడు పవన్ సహకారంతో ముందుకెళ్తున్నాం. కరవుతో పోరాడిన రైతన్నకు కృష్ణా జలాలతో స్వాగతం పలికాం. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టానికి ముగింపు. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. కరవుపై గెలవాలన్న సంకల్పంతో ముందడుగు వేశాం. కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర ఇది. 2024 ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్, నేనూ కలిసి రాష్ట్ర పునర్నిర్మాణంపై మాట ఇచ్చాం. మాపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యమిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల రాష్ట్రానికి అన్నీ ప్రయోజనాలే.

### నీటి సమస్యకు పరిష్కారం.. నదుల అనుసంధానం..

చేతగాకపోతే తప్పు లేదు.. చేశామని మోసం చేస్తేనే పెద్ద తప్పు. ఫేక్ మాటలు చెప్పేవారిని నిలదీయకపోతే అవే వాస్తవాలు అనుకుంటారు. ఆవేదనతో చెబుతున్నా.. ఫేక్ మాటలను సమర్థంగా తిప్పికొట్టాలి. నీటి సమస్యకు ఏకైక పరిష్కార మార్గం.. నదుల అనుసంధానం. నదుల అనుసంధానం జరగాలంటే.. ప్రధాని మోదీకే సాధ్యం. పోలవరం రాష్ట్రానికే జీవనాడి. పోలవరాన్ని 2027 మార్చి నాటికి పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. రాబోయే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలో కూడా చేసుకోబోతున్నాం. గోదావరి నీళ్లు కూడా నల్లమలసాగర్‌కు రావాలి. ఉత్తర భారత్‌లో నదుల అనుసంధానానికి అనేక సమస్యలు పరిష్కరించారు. దక్షిణ భారత్‌లో కూడా గోదావరి, కావేరి అనుసంధానం చేయాలి. గోదావరి నీళ్లు సముద్రంలోకి

వృథాగా పోతున్నాయి. వృథాగా వెళ్లే నీటిని దారిమళ్లిస్తే సంపద సృష్టించొచ్చు. నదుల అనుసంధానంతో దేశం సుభిక్షంగా ఉంటుంది. ఎల్లుండే పోలవరం ఎడమకాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్తున్నాం. ప్రతి నీటిబొట్టును భూగర్భ జలాలుగా మార్చుకోవాలి. నదుల అనుసంధానం జరిగితేనే మంచి భవిష్యత్తు ఉంటుంది.

నల్లమలసాగర్ నుంచి ప్రతిఇంటికి కుళాయి ద్వారా నీరిస్తాం. రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్ట్‌లో మార్కాపురాన్ని భాగం చేశాం. వెనుకబడిన ఈ ప్రాంతం పొరుగు జిల్లాలకు పోటీగా నిలుస్తుంది. వెలిగొండ తొలి దశతో ఆగము.. ఫేజ్ 2 కూడా 2028 నాటికి పూర్తి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రకు అందరూ సిద్ధమని సంకల్పించాలి. నాకు రాజకీయం అంటే ఎన్నికలు కాదు.. ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తా. నెక్స్ట్ ఎన్నికల కోసం కాదు.. నెక్స్ట్ జనరేషన్ కోసం పనిచేస్తా. నా ఊపిరి ఉన్నంత వరకు తెలుగు జాతి కోసం కష్టపడతా. అందరం కలిసి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ చేదాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు.

ఇక సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం పులివెందుల నివాసం నుంచి బయలుదేరి 7:45 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. వర్ధంతి కార్యక్రమం పూర్తయిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రతీ ఏటా వైఎస్సార్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలకు జగన్ హాజరై నివాళులు అర్పించడం తెలిసిందే.

# రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని అన్నారు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అధికారం, హక్కులతో పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. వారికి తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో కొత్త సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు చేయడం సహజమేనని అన్నారు. అయితే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో భూ సమస్యలపైనా కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో

పెట్టడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

# విజయ్ ప్రధాని అభ్యర్థిత్వం రగడ.. కాంగ్రెస్, డీఎంకే నేతల ఫైర్

తమిళనాడులో అధికార టీవీకే (తమిళగ వెట్రి కళగం) పార్టీ, ముఖ్యమంత్రి విజయ్‌ను 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రస్తావిస్తుండడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిపై డీఎంకేతో పాటు మిత్రపక్షమైన కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందిస్తూ, వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఒకవేళ ఇదే ప్రచారం కొనసాగితే మంత్రివర్గం నుంచి వైదొలిగేందుకైనా వెనుకాడబోమని కాంగ్రెస్ హెచ్చరించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఇటీవల తిరుప్పూర్‌లో నిర్వహించిన ఒక సమావేశంలో టీవీకే సీనియర్ నేత, రెవెన్యూ శాఖ మంత్రి కే.ఏ. సెంగొట్టయన్ మాట్లాడుతూ, విజయ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, దేశాన్ని సమర్థవంతంగా నడిపించగల సత్తా ఉన్న నాయకుడని కొనియాడారు. ఆయన స్థాయి ఎంజీఆర్, జయలలితలను మించి ఉంటుందని ప్రశంసించారు. అంతేకాకుండా, టీవీకే అంతర్గతంగా నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ప్రధాని రేసులో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తర్వాత విజయ్ మూడో స్థానంలో ఉన్నారని ఆ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి తరపున రాహుల్ గాంధీయే ప్రధానమంత్రి అభ్యర్థి అని ఆ పార్టీ సీనియర్ నేత మాణికం ఠాగూర్ స్పష్టం చేశారు. ఈ నిర్ణయానికి టీవీకే మద్దతు తెలపని పక్షంలో తమిళనాడు మంత్రివర్గం నుంచి కాంగ్రెస్ వైదొలిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. మరోవైపు, డీఎంకే నేత భారతి ఈ వ్యాఖ్యలను ఎద్దేవా చేస్తూ, "ఊహలకు హద్దులుండవు, రేపు విజయ్ ఏకంగా ఐక్యరాజ్యసమితి చీఫ్ అవుతారని కూడా అంటారేమో" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మరో మిత్రపక్షమైన ఎండీఎంకే సైతం ఈ వాదనను వ్యతిరేకించింది. ఇండియా కూటమికి రాహుల్ గాంధీ మాత్రమే ప్రధానమంత్రి అభ్యర్థి అని, టీవీకే నేతలు ఇటువంటి ప్రచారాలను కట్టిపెట్టాలని సూచించింది. వెరసి, '2029లో విజయ్ ప్రధాని' అనే నినాదం తమిళనాడు అధికార కూటమిలో తీవ్ర చర్చకు దారితీయడమే కాకుండా, మిత్రపక్షాల మధ్య పొడచూపిన విభేదాలను బహిర్గతం చేస్తోంది.

# పౌరసేవల్లో డేటా అనలటిక్స్.. పాలనలో కొత్త శకానికి చంద్రబాబు శ్రీకారం

- మొదటి పేజి తరువాయి

తన క్యాంపు కార్యాలయంలో 'రియల్ టైమ్ గవర్నెన్స్' (ఆర్టీజీ)పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, అల్లూరి విమానాశ్రయం వంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ఇదే స్ఫూర్తిని ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కొనసాగించి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు తాను 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో 20 సార్లు పాల్గొన్నానని గుర్తుచేశారు. ఇదే క్రమంలో సంక్షేమ హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టళ్లకు ఆహ్వానించి, అక్కడి పరిస్థితులు, భోజనం, తాగునీటి సౌకర్యాలపై వివరించాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయన్నారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్ల ద్వారా అన్నార్తులకు సాయం అందించే దాతలను గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అందించాలని చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ సహా అన్ని విభాగాలు ధ్రువపత్రాలను

ఆన్‌లైన్‌లోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీకృత సేవల విధానం ద్వారా ప్రజలకు వేగంగా నిర్ణయాలు అందేలా చూడాలని అన్నారు. పనితీరు ఆధారంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బాధ్యులకు ర్యాంకులు ఇవ్వాలని, లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగంలో 'అవేర్' (ూాఔూ=జు) వేదిక ద్వారా రాష్ట్రంలోని సాగు పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం చేసే రైతులను పూర్తిస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సింధు జలాలపై తీర్పు..

## కోర్టుకు ఆ పరిధిలేదన్న భారత్

- మొదటి పేజి తరువాయి

బ్యాంక్ ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడానికి న్యూఢిల్లీ చెప్పిన కారణం సహేతుకంగా, రద్దుకు సమర్థనీయంగా లేదని పేర్కొంది. జలాల ఒప్పందం పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించింది. అలాగే, జమ్మూకశ్మీర్‌లో నిర్మిస్తున్న హైడ్రోఎలక్ట్రిక్ పనులపై పరిమితులు విధించింది. దీనిపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించింది. ఈ మధ్యవర్తిత్వ న్యాయస్థానం చట్టవిరుద్ధంగా ఏర్పాటైందని, భారత్ సార్వభౌమ నిర్ణయాలపై తీర్పు చెప్పే అర్హత గానీ, అధికార పరిధి గానీ దానికి లేదని స్పష్టంచేసింది. ఈ కోర్టును మొదటి నుంచీ భారత్ గుర్తించలేదని, దాని విచారణలకు ఎప్పుడూ హాజరుకాలేదని తెలిపింది. కాబట్టి ఆ న్యాయస్థానం ఇచ్చే తీర్పులు ఏవీ చెల్లవని, భారత్ చేపట్టే ప్రాజెక్టులపై వాటి ప్రభావం ఉండదని తేల్చిచెప్పింది.

### ఏమిటీ ఒప్పందం?

సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై 1960 సెప్టెంబరులో నాటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం సింధు ఉప నదుల్లో తూర్పున ప్రవహించే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారతదేశానికి హక్కులు లభించాయి. సింధు నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ మద్దతు ఇస్తోందనే కారణంతో 2025 ఏప్రిల్‌లో భారతదేశం ఈ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఉగ్రవాదాన్ని శాశ్వతంగా అణచివేసే వరకు ఈ ఒప్పందం పునరుద్ధరణ ఉండదని భారత్ స్పష్టం చేసింది.

# ఇరాన్ అధ్యక్షుడితో మోదీ భేటీ..

## యుద్ధం తర్వాత తొలిసారి ముఖాముఖి చర్చలు

- మొదటి పేజి తరువాయి

ఫిబ్రవరిలో ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖిగా సమావేశం కావడం ఇదే తొలిసారి.

ఇరువురు నేతలు ఏ అంశాలపై చర్చించారనే విషయం పూర్తిగా వెల్లడికాలేదు. అయితే హర్మూజ్ జలసంధిపై ఇరాన్ విధించిన దిగ్బంధం చర్చల్లో ప్రస్తావనకు వచ్చి ఉండొచ్చని తెలుస్తోంది. కిర్గిజిస్థాన్ పర్యటన తొలి దశలో మోదీతో పెజెష్కియాన్ సమావేశమై చర్చలు జరిపినట్లు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది. బిష్కెక్ బయలుదేరే ముందు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని చెప్పారు. అయితే తమపై జరిగే దాడులకు బలంగా, దృఢంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. తమ ప్రాంతంలో అస్థిరత అన్ని దేశాలకు నష్టమేనని అన్నారు. ఆర్థిక, భద్రతా లక్ష్యాల కోసం దేశాల మధ్య సహకారం అవసరమని పేర్కొన్నారు. అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ మోదీ భేటీ అయ్యారు. రక్షణ, ఆర్థికం, ఔషధాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచే అంశాలపై చర్చించారు. పశ్చిమాసియాలో పరిస్థితితో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అర్మేనియాతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ కానున్నారు. కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ఆరో ప్రపంచ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవంలోనూ మోదీ పాల్గొననున్నారు.

# పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

- మొదటి పేజి తరువాయి

పాటించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## డిప్యూటీ ఎంపీడీవో వీర్రాజు సేవలు ప్రశంసనీయం



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 31:**ఆలమూరు డిప్యూటీ ఎంపీడీవో (జిఎస్‌డబ్ల్యూఎస్)గా షణ్ముఖ వీర్రాజు చేసిన సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీవో ఏ రాజు, తాసిల్దార్ కందుల కుశరాజు తదితరులు పేర్కొన్నారు. వీర్రాజు పదవీ విరమణ వీడ్కోలు సభ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఘనంగా జరిగింది. 36 సంవత్సరాల పాటు తన ఉద్యోగ నిర్వహణలో అధిక శాతం ఆలమూరు మండలంలోనే వీర్రాజు చేయడం విశేషం. గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్ గా, పలు గ్రేడ్ల కార్యదర్శిగా పనిచేస్తూ డిప్యూటీ ఎంపీడీవోగా పదవీ విరమణ చేయడం అరుదైన సంఘటనగా పేర్కొన్నారు. ఎంతో నీతి నిజాయితీగా పనిచేసి ఎలాంటి రిమార్కులు లేకుండా పదవీ విరమణ చేయడం అందరికీ ఆదర్శనీయమన్నారు. వీర్రాజు దంపతులను పూలమాలలు, సాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎజిపి విద్యా ప్రసన్న, మండల పరిషత్ ఏవో ప్రకాష్, పలువురు ఎంపీటీసీలు, నీటి సంఘం అధ్యక్షులు, తాజా మాజీ సర్పంచులు, కూటమి నాయకులు, పలు మండలాల నుంచి వచ్చిన డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు,స్వర్ణ సచివాలయాల ఉద్యోగులు పాల్గొని వీర్రాజు దంపతులను ఘనంగా సత్కరించారు.

## మార్కెట్ కమిటీ అభివృద్ధే లక్ష్యం: మంత్రి సుభాష్



**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 31 :** కాకినాడ రూరల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సోమవారం ఇంద్రపాలెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అధ్యక్షత వహించారు. కూటమి కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. వైసీపీ దుష్ప్రచారాన్ని అభివృద్ధి కార్యక్రమాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాసుమేను మంగ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారంతో కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులతో



ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంతోనే సుపరిపాలన సాధ్యం





### కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 31 :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థల ద్వారా ప్రజలకు వేగవంతమైన,సమర్థవంతమైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ పాలనపై విశ్వసనీయత పెరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, గతంలో అందిన అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలను జిల్లా అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ శాఖల సమన్వయంతో వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం పి జి ఆర్ ఎస్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందన్నారు.ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి,నిర్ణీత కాలపరిమితిలో నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. రీ-ఓపెన్లకు తావులేకుండా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో కాకినాడ జిల్లాను రాష్ట్రస్థాయిలో మెరుగైన స్థానంలో నిలపాలని సూచించారు.

మున్సిపల్ కమిషనర్లు అన్న క్యాంటీన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఏపీఎస్ఆర్టీసీ, సంక్షేమ వసతి గృహాలు,ఐసీడీఎస్, డీఆర్డీఏ,మెప్మా, ఆరోగ్యం,హౌసింగ్, ఎనర్జీ తదితర శాఖలు నిర్దేశిత అంశాల్లో ప్రజల సంతృప్తి స్థాయిని మరింత మెరుగుపర్చాలని సూచించారు.గత నెలలో శాఖల వారీగా నమోదైన సంతృప్తి శాతాలను సమీక్షించి,వచ్చే నెల నాటికి మెరుగైన ఫలితాలు సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.కోర్టు కేసుల్లో సకాలంలో కౌంటర్లు దాఖలు చేయాలని,డ్యాష్‌బోర్డుల ద్వారా ఫిర్యాదుల పరిష్కార పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.బాధ్యతాయుతమైన, అవినీతి రహిత, పారదర్శక పాలన అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన ధ్యేయమని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.కార్యక్రమంలో శిక్షణా కలెక్టర్ ప్రియా, డీఆర్వో డాక్టర్ డి.తిప్పే నాయక్, డీడీఓ పి.వాసుదేవరావు,సీపీఓ పి. త్రినాథ్,పెద్దాపురం ఆర్డీవో పి.కృష్ణమూర్తి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దనాపల్లిలో అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ.





**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 31:** మండల పరిధి పెద్దనాపల్లి గ్రామంలో సుమారు రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సోమవారం ప్రారంభించారు.ప్రత్తిపాడు సెక్టార్ ఐసిడిఎస్ సీడీపీవో టి పద్మావతి ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త మేడిశెట్టి బాబి, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ లు అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించారు.గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్య, అన్ని రంగాల్లో మహిళాభివృద్ధి,శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.చిన్నారులకు చిన్న వయసు నుంచే పౌష్టికాహారం,ప్రాథమిక విద్య,ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు మెరుగైన వసతులతో కూడిన అంగన్వాడీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యం అన్నారు. లక్ష్యమన్నారు.అంగన్వాడీ సిబ్బంది చిన్నారుల సంరక్షణలో మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం పిఎసి అధ్యక్షుడు సూతి బూరయ్య ,లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు పెంటకోట మోహన్, ఎన్డీఏ కూటమి నాయకులు బుద్ద సూర్యప్రకాష్,సత్యవతి ఈశ్వరరావు, అలమండ చలమయ్య,బొదిరెడ్డి గోపాలకృష్ణ, , ఎస్ జి వి సుబ్బరాజు ,చిక్కాల లక్ష్మణరావు,కొప్పుల బాబ్జి,బస్వా మహాలక్ష్మి ప్రసాద్,మైరాల కనకారావు,చందువోలు రాజా,మాగాపు వీరబాబు,గంగిరెడ్ల మణికంఠ,జిగటాపు సూరిబాబు,ఎంపీడీవో రామరాజు వర్మ,ఎంఈవో అబ్బాయి,అంగన్వాడీ సూపర్వైజర్ చక్రవేణి,అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఘాట్లను పరిశీలించిన ఎస్పీ బిందుమాధవ్





**కాకినాడ, ఆగస్టు 31 పెన్ పవర్:** రానున్న వినాయక చవితి సందర్భంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా,సురక్షితంగా జరిగేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కాకినాడ నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగన్నాథపురం బ్రిడ్జి వద్ద నిమజ్జన ఘాట్లను ఎస్పీ పరిశీలించారు.నిమజ్జన ప్రాంతంలో భద్రత,ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకలు,ప్రజల సౌకర్యాలపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ బీచ్‌ను సందర్శించి కాకినాడ రూరల్ ఇన్‌స్పెక్టర్, తిమ్మాపురం ఎస్సైలతో నిమజ్జన ఏర్పాట్లు,ట్రాఫిక్, భద్రతా చర్యలపై చర్చించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. తనిఖీల్లో ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, పోర్ట్ ఇన్‌స్పెక్టర్ పి.సునీల్ కుమార్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగదుర్గారావు, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ,ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్,కాకినాడ రూరల్ ఇన్‌స్పెక్టర్ డి.కృష్ణచైతన్య, వన్‌టౌన్ ఎస్సై సన్యాసినాయుడు,తిమ్మాపురం ఎస్సై వై. గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రూ.78,135 కోట్లతో 36 నీటి ప్రాజెక్టులు.. గడువులోగా పూర్తి చేస్తాం

### టీడీపీ ఎమ్మెల్యే, టీటీడీ సభ్యుడు జ్యోతుల నెహ్రూ

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 31 :** ఎల్‌నినో ప్రభావంతో దేశంలో తీవ్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతాంగానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ సభ్యుడు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 78,135.858 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో గడువులోగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు.సోమవారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబుతో కలిసి నెహ్రూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు తొలి దశను రూ.6,985 కోట్ల వ్యయంతో పూర్తి చేసి సోమవారం జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 2న అనకాపల్లి వద్ద రూ.1,679 కోట్లతో పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులు పూర్తి చేసి జలహారతి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు.1996లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, అనంతరం వచ్చిన ప్రభుత్వాలు ప్రాజెక్టు పూర్తిపై తగిన శ్రద్ధ చూపకపోవడంతో జాప్యం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వెలుగొండ పేరుతో భారీగా నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టును ఫేజ్-1లో పూర్తి చేశామని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టును తన తండ్రి పూర్తి చేశారని, చంద్రబాబు చేసిందేమీ లేదని మాజీ సీఎం జగన్ పేర్కొనడాన్ని నెహ్రూ తప్పుబట్టారు.

పోలవరం ప్రాజెక్టును రూ.30,436 కోట్ల వ్యయంతో 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కాటన్ బ్యారేజీ గేట్ల ఆధునీకరణకు రూ.152 కోట్లతో 2027 జూన్ నాటికి, గోదావరి డెల్టా వ్యవస్థ ఆధునీకరణను రూ.3 వేల కోట్లతో 2028 జూన్ నాటికి, బుడమేరు యూటీ నిర్మాణాన్ని రూ.76 కోట్లతో 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఫేజ్-1ను రూ.8,075 కోట్లతో పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక రంగం అభివృద్ధి చెంది ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని నెహ్రూ పేర్కొన్నారు. అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లోనూ సాగునీటి ప్రాజెక్టుల పనులను ముందుకు తీసుకెళ్లిన ఘనత



చంద్రబాబు ప్రభుత్వానిదేనన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనాలు వచ్చే ప్రాజెక్టులకే ప్రాధాన్యత ఇచ్చి, కీలకమైన ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని నెహ్రూ విమర్శించారు.

## మండలంలో తుది పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

18 గ్రామ పంచాయతీలకు 192 పోలింగ్ స్టేషన్లు



**గండేపల్లి, పెన్ పవర్ ,ఆగస్టు 31:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికలు--2026కు సంబంధించి గండేపల్లి మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను అధికారులు విడుదల చేశారు.

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆమోదించిన 192 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను సోమవారం (ఆగస్టు 31) ప్రచురించారు. గండేపల్లి మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డుతో పాటు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో జాబితాను అందుబాటులో ఉంచారు. అలాగే ప్రతి గ్రామంలో రెండు ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రజల పరిశీలనకు వీలుగా జాబితాను ప్రదర్శించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరికృష్ణ సత్య రెడ్డి తెలిపారు.

## పేరవరం జాయినింగ్ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన వైసిపి జిల్లా అధ్యక్షులు :చిర్ల జగ్గిరెడ్డి



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 31:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామంలో రేపు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాయినింగ్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వహించే ప్రదేశాన్ని సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్న నేపథ్యంలో కార్యక్రమానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వేదిక, పార్కింగ్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పార్టీలో చేరనున్న నాయకులు, కార్యకర్తలకు సాదర స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పేరవరం ప్రాంతంలో పార్టీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

## సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కెరీర్‌పై మార్గదర్శనం

అలుమ్ని ఇంటరాక్షన్‌లో పరిశ్రమ అనుభవాలను పంచుకున్న ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పల్లా రమ్య



**గండేపల్లి ,పెన్ పవర్, ఆగస్టు 31:**ఆదిత్య యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అలుమ్ని ఇంటరాక్షన్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. హైదరాబాద్‌లోని జేఎల్‌ఎల్‌లో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న యూనివర్సిటీ అలుమ్ని శ్రీమతి పల్లా రమ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో తన పరిశ్రమ అనుభవాలను పంచుకున్నారు.

సివిల్ ఇంజినీరింగ్ పూర్తయిన అనంతరం సైట్, డిజైన్, డ్రాఫ్టింగ్, ప్లానింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో అందుబాటులో ఉన్న కెరీర్ అవకాశాలను ఎలా ఎంచుకోవాలి, గ్రాడ్యుయేషన్‌కు ముందే అభివృద్ధి చేసుకోవాల్సిన సాంకేతిక, వృత్తి నైపుణ్యాలు, సరైన కెరీర్ మార్గాన్ని ఎంచుకునే విధానం తదితర అంశాలపై రమ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తన కళాశాల రోజులలో ఎదురైన అనుభవాలు, చేసిన పొరపాట్లు, ముందుగానే కొన్ని విషయాలు నేర్చుకుని ఉంటే కెరీర్‌కు మరింతగా ఉపయోగపడేవని భావించిన అంశాలను కూడా విద్యార్థులతో పంచుకున్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కెరీర్‌కు సంబంధించిన పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో రమ్య విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. పరిశ్రమలోని వాస్తవ అనుభవాలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, భవిష్యత్ కెరీర్‌పై స్పష్టత కల్పించడంలో ఈ అలుమ్ని ఇంటరాక్షన్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది.

## ఆదిత్య యూనివర్సిటీలో ముగిసిన 'ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్' వర్క్‌షాప్





విద్యార్థులకు క్లౌడ్ టెక్నాలజీపై ఆచరణాత్మక శిక్షణ

**గండేపల్లి,పెన్ పవర్ , ఆగస్టు 31:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఢ డేటా సైన్స్ విభాగం, సిఎస్ఐ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో మూడవ సంవత్సరం ఐటీ, డేటా సైన్స్ విద్యార్థులకు నిర్వహించిన మూడు రోజుల 'ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్' వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది.

అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) ప్రీమియం సపోర్ట్, విశాఖపట్నానికి చెందిన క్లౌడ్ సపోర్ట్ డేటాబేస్ ఇంజనీర్ శ్రీ సాయికిరణ్ ముమ్మిన రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. వర్క్‌షాప్‌లో క్లౌడ్ కంప్యూటింగ్ మౌలిక సూత్రాలు, ఏడబ్ల్యూఎస్ మౌలిక సదుపాయాలు, ఐఏఎం, ఈసీ2, ఎస్3, సర్వర్‌లెస్ కంప్యూటింగ్, లాంబ్డా, డైనమోడీబీ, ఏపీఐ గేట్‌వే తదితర అంశాలపై విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ ఇచ్చారు. వివిధ ఏడబ్ల్యూఎస్ సేవలను అనుసంధానించి పూర్తి స్థాయి సర్వర్‌లెస్ అప్లికేషన్‌ను రూపొందించడం, అమలు చేయడం, భద్రతా ప్రమాణాలు, నెట్‌వర్కింగ్, వాస్తవ ప్రపంచ అనువర్తనాలు, భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ముగింపు కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజినీరింగ్ ఢ సైన్స్) డాక్టర్ ఎ. రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.వి. రాజేష్, ఐటీ విభాగాధిపతి డాక్టర్ మాకినీడి రాజాబాబు, డిప్యూటీ హెడ్స్ డాక్టర్ ఏ. లక్ష్మణ రావు, శ్రీమతి ఎస్. నీలిమ తదితర అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇలాంటి ఆచరణాత్మక శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించిన రిసోర్స్ పర్సన్, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. అనంతరం శ్రీ సాయికిరణ్ ముమ్మినను జ్ఞాపికతో సత్కరించారు.

## ఇంటింటికి వెళ్ళి ప్రజలు సమస్యలు తెలుసుకుంటున్న నిమ్మకాయల రంగనాగ్



**సామర్లకోట.. పెన్ పవర్.. ఆగస్టు.25.** పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట పట్టణం 23వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంటు తెదేపా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వాటి పరిస్కారానికి శాసన సభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప ద్వారా కృషి చెయ్యనున్నట్టు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధికి సంభందించి ప్రజలకు కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమార స్వామి, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీశ్ మోహన్, బలుసు వాసు, నిడదవోలు వీర్రాజు, గోలి శ్రీరాం, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ కి దూరంగా ఉండండి విద్యార్థులు కి అవగాహన సదస్సు...




**సామర్లకోట.. పెన్ పవర్.. ఆగస్టు.31.**సామర్లకోట గవర్నమెంట్ జూనియర్ కళాశాల లో విద్యార్థులకు "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమం కాకినాడ ఈగల్ టీ సిఐ జి వెంకటేశ్వర రావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు, ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల విద్యార్థుల భవిష్యత్తు, ఆరోగ్యం, కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అలాగే డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం, అనుమానాస్పద కార్యకలాపాలు తమ దృష్టికి వస్తే "ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972"కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించి "డ్రగ్స్ వద్దు బ్రో" నినాదం చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లీలా శ్రీదేవి, కళాశాల సిబ్బంది, ఈగల్ టీమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో 'వేద--2కె26' సందడి

పోస్టర్ ఆవిష్కరణ.. రూ.5 లక్షల వరకు బహుమతులు






**గండేపల్లి ,పెన్ పవర్, ఆగస్టు 31:** ఆదిత్య యూనివర్సిటీలో సెప్టెంబర్ 11, 12 తేదీల్లో నిర్వహించనున్న 'వేద--2కె26' స్టూడెంట్ సింపోజియం పోస్టర్‌ను యూనివర్సిటీ అధికారులు ఆవిష్కరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో రెండు రోజుల పాటు వివిధ పోటీలు, కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇంజినీరింగ్ అండ్ డిజైన్, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజిటల్ టెక్నాలజీ, సైన్స్--ఫోరెన్సిక్స్ అండ్ ఇన్వెస్టిగేషన్, మేనేజ్‌మెంట్--బిజినెస్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగాల్లో హ్యాకథాన్, ఐడియాథాన్, గ్లైడర్ ఛాలెంజ్, రోబో రేస్ తదితర పోటీలను నిర్వహించనున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.5 లక్షల వరకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించడమే 'వేద--2కె26' ప్రధాన ఉద్దేశమని యూనివర్సిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ప్రో వైస్ ఛాన్సలర్లు డా. ఎ. రమేష్, డా. ఎస్. రమాశ్రీ, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## మన గ్రామం మన బలంవైఎస్సార్ సిపి



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 31:** వక్కలంక గ్రామం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టి బలోపేతానికి కృషిలో బాగంగా మన గ్రామం మన బలం నిర్వహించారు. మండలం వై.ఎస్.అర్ కాంగ్రెస్ పార్టి మండల అధ్యక్షులు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మైల ఆనందరావు, గ్రామశాఖ అధ్యక్షులు యల్లమిల్లి జయబాబు, మొసలపల్లి గ్రామ శాఖ పితాని సతీష్, సానబోయిన మురళి, ముత్తాబత్తుల సోము శేఖర్,రాష్ట్ర నాయకులు పీకే రావు, కోట విజయ్ రాజు, ఎంపీటీసీ పిల్లి రమేష్, పినిపే మోహన్, వాసంశెట్టి వీరాంజనేయులు, విడలా వేణు , విత్తనాల కామేష్ గారు, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు నెల్లి ప్రసాద్, యనమధుల వెంకటేశ్వర రావు, రైతు విభాగం నేదునూరి వెంకటేశ్వర రావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం సత్తిబాబు, పిల్లి సూర్య చంద్రారావు, గ్రామ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి గోవిందరాజు గ్రామ ప్రధాన కార్యదరి నేదునూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# వేమన చెప్పిన నీతిని ప్రతి ఒక్కరూ అనుసరించాలి





మాతృభాష ప్రాధాన్యాన్ని గుర్తించాలి: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 31:**వేమన చెప్పిన నీతిని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, అప్పుడే తెలుగువాడిగా సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగగలమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.

రావులపాలెం ప్రగతి భారతమ్ ట్రస్టు, పెరవలి మాతృభాషా పరిరక్షణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రావులపాలెం చిన్నం సుబ్బిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో 'వేమన శతకం శతక పద్య సహస్ర గళార్చన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1008 మంది చిన్నారులు 108 వేమన పద్యాలను ఆలపించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, తమలంపూడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మాతృభాషా పరిరక్షణ సేవా సమితి విద్యార్థులతో వేమన శతక పద్యాలను కంఠస్థం చేయించడం అభినందనీయమన్నారు. నేటి విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే విధంగా, భవిష్యత్‌లో మంచి పౌరులుగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో తెలుగు భాష గౌరవాన్ని, ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు.విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో, తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమానికి హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. వారితో వేమన పద్యాలను చదివించారు. వేమన శతకం వంటి శతకాలను చదవడం ద్వారా విద్యార్థుల్లో వినయం, సత్ప్రవర్తన, నైతిక విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. మాతృభాష పరిరక్షణ సేవా సమితి సలహాదారులు సి హెచ్ వి ఎస్ నాగభూషణం మాట్లాడుతూ ఆగస్టు 29 11,000 మంది విద్యార్థులతో 108వేమన పద్యాలు పాడించామని దానికి అనుగుణంగా ఈరోజు రావులపాలెంలో 1000 మంది విద్యార్థులు 20 స్కూల్లు నుండి విద్యార్థుల చేత పద్యాలు పాడించారు వేమన శతకంలోని ప్రతి పద్యాన్ని కంఠస్థం చేయడమే కాకుండా, దాని భావాన్ని అర్థం చేసుకుని ఆచరణలో పెట్టినప్పుడే విద్యార్థులకు సత్ఫలితాలు లభిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. నిర్వాహకులను అభినందిస్తూ తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో "అన్ని భాషల కన్నా అమ్మ భాష మిన్న" అంటూ నినాదాలు చేయించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూమాతృభాష ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి, తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష పటిష్టం చేసే తెలుగు భాష టీచర్లను సాల్వాతో సత్కరించి మెమరీ ని అందించారు. 108 వేమన శతకాలను కంఠస్థం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పారిశ్రామిక అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి

ఎంఎస్ఎంఈల ప్రోత్సాహానికి సెప్టెంబర్ 5న కాకినాడలో వర్క్‌షాప్





**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 31 :** పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు జిల్లాలోని స్థానిక నిరుద్యోగ యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' లక్ష్య సాధన దిశగా ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న కాకినాడలో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు.సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో 32వ ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. తొలుత గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, పురోగతిని కమిటీ సభ్యులతో సమీక్షించారు.సింగిల్ డెస్క్ పాలసీ ద్వారా 64 యూనిట్లకు అనుమతులు మంజూరు చేసేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. వివిధ ప్రభుత్వ పథకాల కింద సబ్సిడీపై 10 యూనిట్ల మంజూరుకు కూడా ఆమోదం లభించింది. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద ఆరు కేటగిరీల్లో ప్రతిపాదించిన 227 యూనిట్లలో 138 యూనిట్ల గ్రౌండింగ్‌కు అనుమతులు మంజూరు చేశారు.ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ యూనిట్ల మంజూరు, ఏపీఐఐసీ ద్వారా పారిశ్రామిక అవసరాలకు భూముల సమీకరణ, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ద్వారా వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటవుతున్న పరిశ్రమలు, పారిశ్రామిక యూనిట్లలో స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన ఉద్యోగుల వివరాలను 15 రోజుల్లోగా సేకరించి, వాటికి అనుగుణంగా స్థానిక యువతకు శిక్షణ అందించేలా జిల్లా పరిశ్రమల కేంద్రం, నైపుణ్యాభివృద్ధి శాఖలు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను రూపొందించి, శిక్షణ పొందిన స్థానిక యువతకు ఆయా పరిశ్రమల్లో ప్రాధాన్యతతో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు సెప్టెంబర్ 5న కాకినాడలో జరిగే వర్క్‌షాప్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను పెద్ద సంఖ్యలో పాల్గొనేలా డి ఆర్ డి ఏ, మెప్మా, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సింగిల్ డెస్క్ పాలసీ ద్వారా పారిశ్రామికవేత్తలకు అనుమతుల ప్రక్రియను మరింత సరళతరం చేయడంతో పాటు పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అర్హత కలిగిన పారిశ్రామిక యూనిట్లకు ప్రభుత్వ నిబంధనల మేరకు వర్తించే సబ్సిడీలు, రుణాలను త్వరగా మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఎస్ ఐ పి బి కింద జిల్లాకు వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనల పురోగతిని సమీక్షించి, ఆయా పరిశ్రమలకు అవసరమైన స్థల కేటాయింపులు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు కొత్తగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అనుకూలమైన స్థలాల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేయడం, స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా సమీక్షించారు.సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్. గణపతి, సహాయ సంచాలకులు ఎస్. విజయ్ కుమార్,చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి గౌతమ్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోపికృష్ణ,కమిటీ సభ్యులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రెవెన్యూ ప్రాధాన్య అంశాల్లో వారంవారం పురోగతి సాధించాలి

రీసర్వే, రెవెన్యూ క్లినిక్, ఓటర్ల జాబితా, భూ రికార్డుల స్వచ్ఛీకరణపై ప్రత్యేక దృష్టి
కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 31 :** ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన రెవెన్యూ అంశాల్లో అధికారులు వారం వారం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఆశించిన పురోగతిని తప్పనిసరిగా సాధించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. రీసర్వే, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, రెవెన్యూ క్లినిక్, రెవెన్యూ వన్, భూ రికార్డుల స్వచ్ఛీకరణ, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.సోమవారం కాకినాడ కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా రీసర్వే పురోగతి, ప్రజా సంతృప్తి స్థాయిలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, రెవెన్యూ క్లినిక్, రెవెన్యూ వన్, భూ రికార్డుల స్వచ్ఛీకరణ, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ తదితర అంశాలను సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే, రెవెన్యూ క్లినిక్, రెవెన్యూ వన్, రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రీసర్వేను అత్యంత ఖచ్చితత్వంతో,పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని,భవిష్యత్తులో భూవివాదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూ యజమానులు, వాస్తవ అనుభవదారుల హక్కులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిష్పక్షపాతంగా రీసర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వేలో నమోదు చేసే సర్వే నంబర్లు, ఆధార్ నంబర్లు, భూవివరాలు తదితర అంశాల్లో పొరపాట్లు జరగకుండా అధికారులు, సర్వేయర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పెండింగ్ రీసర్వే అంశాలను ప్రత్యేక కార్యాచరణతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సిగ్నల్ సౌకర్యం లేని మారుమూల గ్రామాల్లోనూ రోవర్స్ సహకారంతో రీసర్వే కొనసాగించాలని సూచించారు.భూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా సమన్వయంతో పరిష్కరించాలని, సమస్యల పరిష్కారం అనంతరం ఈ-కేవైసీ, బుక్ ఫర్ ప్రింటింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా పూర్తి చేసి అర్హులైన భూ యజమానులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు సకాలంలో అందేలా చూడాలని తెలిపారు. భూ సంబంధిత రికార్డులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, డిజిటల్, భౌతిక రికార్డుల మధ్య ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా చూడాలని సూచించారు.రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు రికార్డుల్లోని తప్పులు, పెండింగ్ అంశాలను గుర్తించి సరిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, స్వచ్ఛీకరణ కీలకమని పేర్కొన్నారు.రెవెన్యూ క్లినిక్‌లలో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి మండలంలో రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన ఫిర్యాదులు, వాటి పరిష్కార స్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో ప్రజా సంతృప్తి స్థాయిని మరింత పెంచాలని ఆదేశించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు అనర్హులు, మరణించిన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన ప్రతి రెవెన్యూ అంశానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని వారం వారం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యత అంశాల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులో నాణ్యమైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు.వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో డాక్టర్ డి. తిప్పే నాయక్, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పంచారామ క్షేత్రం దర్శించుకుని చాలా ఆనందంగా ఉంది



**సామర్లకోట.. పెన్ పవర్... ఆగస్టు.31:**పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో హైదరాబాదుకు చెందిన కస్టమ్స్ చీఫ్ కమిషనర్ ఎ ఆర్ ఎస్ కుమార్ బృందం సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయానికి విచ్చేసిన కమిషనర్ బృందం తొలిత భీమేశ్వర స్వామిని బాలా త్రిపుర సుందరి అమ్మవారి లను దర్శించుకున్నారు. అనంతరం వారికి ఆలయ పండితులు నందిమండపంలో పండిత ఆశీర్వచనాలు అందజేసి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి బలమేలకంఠం, ఆలయ పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా జాబ్ మేళా

సెప్టెంబర్ 6న పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహణ



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 31:** నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.

ఈ మేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జాబ్ మేళాకు సంబంధించిన ప్రచార గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు.సెప్టెంబర్ 6న పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాల కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో జాబ్ మేళాకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, రెజ్యూమ్‌తో సెప్టెంబర్ 6న ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రాంగణానికి చేరుకోవాలని తెలిపారు. ఎంప్లాయ్‌మెంట్,ఇండస్ట్రీస్,పాలిటెక్నిక్, ఐటీఐ,నైపుణ్యాభివృద్ధి తదితర శాఖల అధికారులు సమన్వయంతో జాబ్ మేళాలో పాల్గొని అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన యువత ముందుగానే ఉద్యోగ అవకాశాలు, అర్హతలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు.మరిన్ని వివరాల కోసం 8500885866, 9440756250 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. జాబ్ మేళా,ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన వివరాలను లో తెలుసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.కావాలంటే ఇదే సమాచారాన్ని ఫర్ స్క్రోల్ కోసం 3--4 లైన్లలో, లేదా ఆకర్షణీయమైన హెడ్డింగ్‌లు--సబ్‌హెడ్డింగ్‌లతో మెయిన్ వార్తగా కూడా తయారు చేయవచ్చు.

## పోలింగ్ స్టేషన్ ల తుది జాబితా ప్రచురణ....



**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 31:-** గ్రామ పంచాయతీ ఎన్ని కలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ ల తుది జాబితాను ఈ రోజు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల పరిషత్ కార్యాలయము శంఖవరం, నోటీసు బోర్డ్ నందు మరియు అన్నీ గ్రామ పంచాయతీ ల నోటీసు బోర్డులు, మరియు గ్రామ పంచాయతీ లోని ఇతర ముఖ్య మైన ప్రదేశాలలో ప్రచురించుట జరిగినది, శంఖవరం మండలంలో ని మొత్తం 156 వార్డులకు గాను 172 పోలింగ్ స్టేషన్ లను గుర్తించి,ఫైనల్ పబ్లికేషన్ చేయుట జరిగింది, అన్ని అన్నారు.ఎ .అన్నవరం గ్రామ పంచాయతీ నందు ఒక వార్డ్ కి సగటున 650 కంటే ఎక్కువగా ఓటర్లు ఉండడంతో 16 వార్డ్ లకు గాను 32 పోలింగ్ స్టేషన్ లను గుర్తించడ మైనది.ఎస్సీ ఎస్టీ బీసీ జాబితా ధ్రువీకరణ కొరకు గ్రామ సభలు శంఖవరం మండలంలో ని అన్నీ గ్రామ పంచాయతీ లలో ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్ల జాబితా ధ్రువీకరణ కొరకు ఈ నెల 3 వ తేదీ నుంచి 6 తేదీ వరకూ గ్రామ సభలు నిర్వహించ నున్నాము, కావున ఈ నెల 25 వ తేదీన ప్రచురించిన ముసాయదా జాబితా పై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్ననూ గ్రామ సభలో కార్యదర్శులకు అందజేయ వలెను అన్ని మండల అభివృద్ధి అధికారి అన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జగ్గంపేట సీఐ తిరుపతిరావు



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 31:** కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డి.ఎస్.పి ఏబిజి తిలక్ పర్యవేక్షణలో జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామంలో ప్రజలకు చట్టాలు, గంజాయి, డ్రగ్స్ – దుష్పరిణామాలు సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట సిఐ బి.తిరుపతిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ తిరుపతిరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వాటి వలన ఆరోగ్యం, కుటుంబం మరియు సమాజంపై పడే దుష్ప్రభావాల గురించి ప్రజలకు మరియు యువతకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన మరియు బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా, జగ్గంపేట సీఐ 9440786529, జగ్గంపేట ఎస్సై 9440796569 డయల్ 112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట స్టేషన్ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## సత్తా చాటిన జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 31**: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కాకినాడ పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాలలో ఎన్. ఆర్.సి కాకినాడ జిల్లాస్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు తమ సత్తాను చాటారు. జగ్గంపేట విద్యార్థులు ఎన్.ఆర్.సీ పరిధిలోని 11 కళాశాలలతో రన్నింగ్, లాంగ్ జంప్, షార్ట్ పుట్ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి డి.లోవకుమార్ 100 మీటర్ల రన్నింగ్ లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని తమ ప్రతిభను చాటాడు. ఈ బహుమతిని కాకినాడ పిఠాపురం రాజాస్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ మేహర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం జగ్గంపేట కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.చెన్నా రావు, ఇతర అధ్యాపకులు విజయం సాధించిన విధార్థి డి.లోవకుమార్ ను అభినందించారు.ం

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి.

- మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు.






**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 31:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని దాసరి శాలిని అనంతపురం జిల్లా పామిడిలో ఆగస్టు 22, 23 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పాల్గొని 100 మీ., 200 మీ., 400 మీ. పరుగు పందేలలో ప్రథమ స్థానంలో నిలిచి మూడు బంగారు పతకాలు సాధించిండమే కాకుండా, సెప్టెంబర్ 5, 6, 7 తేదీలలో హైదరాబాద్ లో జరిగే సౌత్ జోన్ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా శాలినికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండల బిజెపి అధ్యక్షుడు రాజబాబు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ శాలిని భవిష్యత్తులో మరిన్ని బంగారు పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేసారు.చదువుతోపాటు క్రీడారంగంలో కూడా మంచి ప్రతిభ కనపరుస్తున్న విజ్ఞాన భారతి స్కూల్ విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు గాడి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ టి. నాగేశ్వరరావు,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరిస్తా





### ఘనంగా కాకినాడ రూరల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 31 :** నూతనంగా ఎన్నికైన కాకినాడ రూరల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కాకినాడ ఇంద్రపాలెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సోమవారం కాకినాడ రూరల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కూటమి కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.మార్కెట్ కమిటీ చైర్మన్ మాసుమేను మంగ మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మార్కెట్ కమిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.అనంతరం నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి,పిల్లి సత్యనారాయణ మూర్తి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, రంబాల వెంకటేశ్వరరావు, చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్మన్ సూర్యనారాయణ రాజు, కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ్డ రమేష్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ,మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, గోదావరి డెల్టా నీటి సంఘం అధ్యక్షుడు సునీల్, కుడా చైర్మన్ తలాటం సత్య,ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలలో మెనూ, క్వాంటిటీ బోర్డులు ఏర్పాటు చేయాలి



సలాది వీరబాబు

**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 31 :** ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన మెనూ బోర్డును, ఆహారం తయారు చేసే ప్రదేశంలో క్వాంటిటీ బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు సూచించారు. కాజులూరు బీజేపీ మండల అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ నేతృత్వంలో, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పిలుపు మేరకు మండలంలోని చేదువాడ గ్రామంలోని ఎంపీపీ పాఠశాల, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా సలాది వీరబాబు మాట్లాడుతూ చేదువాడ పాఠశాలలో విద్యార్థుల క్రమశిక్షణ,భోజనం తయారీ, వడ్డింపు విధానం బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.పిల్లలకు నాణ్యమైన ఆహారం అందేలా ప్రధానోపాధ్యాయులు,సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే నెలలో రాష్ట్ర ఫుడ్ కమిటీ డైరెక్టర్ పాఠశాలలను సందర్శించే అవకాశం ఉన్నందున మెనూ బోర్డులు అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి రామకృష్ణ, తలాటం అమ్మాజీ, బండారు సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన ఎస్పీ బిందుమాధవ్






**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 31 :** సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా కాకినాడ పోలీసు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ పరీక్షలను ఎస్పీ పరిశీలించి,పోలీసు అధికారులు,సిబ్బంది,వారి కుటుంబ సభ్యులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇనోదయ హాస్పిటల్, త్రివేణి డెంటల్ కేర్, శ్రీ సూర్య ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు కలిపి సుమారు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఆయా ఆసుపత్రుల వైద్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు





ఎస్పీ బిందుమాధవ్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 31:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి, వాస్తవాలు నిర్ధారించిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ఎస్పీ మొత్తం 46 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో భూ తగాదాలకు సంబంధించి 19, కుటుంబ కలహాలకు సంబంధించి 13, ఇతర సమస్యలకు సంబంధించిన 14 ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను ఎస్పీ తెలుసుకున్నారు. సంబంధిత స్టేషన్ అధికారులు ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి ఏడు రోజుల్లోగా విచారణ పూర్తి చేసి, తగిన పరిష్కారం చూపడంతో పాటు వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని ఎస్పీ ఆదేశించారు.ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నారని ఎస్పీ తెలిపారు.

## నాగేంద్రబాబు కుటుంబానికి మాల మహానాడు సభ్యులు ఆర్దిక సాయం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు31:**వాకలగురువు గ్రామం, బుల్లి కాలనీకి చెందిన ముత్తాబత్తుల నాగేంద్రబాబు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబానికి మాలమహానాడు సభ్యులు ఆర్థిక సహాయం. అంబేద్కర్ జయంతి రోజున స్థానిక సెంటర్లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నాగేంద్రబాబు కుటుంబానికి అంబాజీపేట మాల మహానాడు తరపున రూ. 36వేల 800/- లు ఆర్థిక సాయం అందచేసారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ నాగేంద్రబాబు మరణం బాధాకరమని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు నాగవరపు నాగరాజు, సెక్రటరీ సుధాకర్, పులిదిండి వీర వెంకట సత్యనారాయణ, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, గోసంగి సత్యనారాయణ, గోసంగి కుమారస్వామి, గోగి శ్రీ రామమూర్తి, నూకపెయ్యి చిన్న, సిద్దాబత్తుల శ్రీ నివాసరావు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# జాతీయ స్థాయి హైజంప్ పోటీలకు చంద్రకళ ఎంపిక



క్రీడాకారిణిని అభినందించిన సత్యం వాసంశెట్టి

**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 31 :** జాతీయస్థాయి హైజంప్ పోటీలకు ఎంపికైన రామచంద్రపురం డిగ్రీ కళాశాల విద్యార్థిని పి. చంద్రకళను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం అభినందించారు. చంద్రకళతో పాటు ఆమె కోచ్ అరుణ్‌కుమార్, డిగ్రీ కళాశాల పీడీ నూకరాజును సైతం అభినందించారు. తిరుపతిలో ఇటీవల జరిగిన హైజంప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చంద్రకళ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని సత్యం పేర్కొన్నారు. పాండిచ్చేరిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు చంద్రకళ, ఆమె కోచ్‌కు అవసరమైన ప్రయాణ టికెట్లను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. జాతీయస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి విజయం సాధించి రామచంద్రపురం ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను ప్రోత్సహించడంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఇప్పటికే చంద్రకళకు అవసరమైన షూస్, స్పోర్ట్స్ కిట్‌లను అందించినట్లు చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ప్రతిభావంతులైన యువతకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ఫౌండేషన్ అండగా నిలుస్తుందని సత్యం హామీ ఇచ్చారు.


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'


'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఇన్పుట్ సబ్సిడీతోపాటు ఎకరానికి 25000 నష్ట పరిహారం ఇవ్వాలి

-రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కామన ప్రభాకరరావు



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు, 31:** సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు పరిధిలోని పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఇన్పుట్ సబ్సిడీతోపాటు 25000 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కామన ప్రభాకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రత్తిపాడు మండలం సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు,మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు,పదివేల ఎకరాల ఆయకట్టు గల సుబ్బారెడ్డి సాగర్ వర్షాలు లేని కారణంగా ఎండిపోవడంతో ఆ ప్రాజెక్టు కింద ఉన్న పదివేల ఎకరాల రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఎండిపోయిన వరి నాట్లను, ఆ ప్రాజెక్టును, అదేవిధంగా చంద్రబాబు సాగర్ లో నీరు ఉండి కాలువ లేని కారణంగా రైతాంగం ఇబ్బంది పడుతున్నారు. ఎండి పోయిన వరి నాట్లను, కాలువలను, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాదేపల్లి సత్యనందరావు,నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, ఉమ్మిడి వెంకట్రావు, పిసిసి సభ్యులు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కామన ప్రభాకర్ రావు మాట్లాడుతూ రైతులకు ఇన్పుట్ సబ్సిడీ తో పాటు ఎకరాకు 25000 చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రిప్రజెంటేషన్ ఇస్తానన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు మాట్లాడుతూ రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని అలాగే సన్నకారు రైతులకు సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రత్తిపాడు నియోజకవర్గ రైతులు, కౌలు రైతులు పట్ల కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిన నష్టపరిహారం 25000 తక్షణమే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ కాకర్ల శ్రీహరిబాబు, పి సి సి సభ్యులు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కాకినాడ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మేడిశెట్టి నారయ్య కాపు,కాకినాడ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ముయ్యటి సూర్యప్రకాశరావు, జిల్లాఓబీసీ చైర్మన్ కొల్లు వీర గణేష్, కాకినాడ జిల్లా యువజన నాయకులు రామకుర్తి సూర్యనారాయణ, ప్రత్తిపాడు మండల అధ్యక్షులు దొడ్డిపట్ల సుబ్బరాజు, కందిమల్ల శామ్యూల్, ధోని వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి వీరబాబు, దంతం శెట్టి చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## అన్నవరం దేవస్థానంలో ముగ్గురు ఉద్యోగులకు ఘన వీడ్కోలు



**అన్నవరం, పెన్ పవర్, ఆగస్టు 31** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ భక్తులకు, దేవస్థానానికి సేవలందించిన ముగ్గురు ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు.

దేవస్థానంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సేవలందించిన పాలంకి జగ్గారావు, పర్యవేక్షణ అధికారిగా విధులు నిర్వహించిన పర్వత నరసింహారావు, జూనియర్ అసిస్టెంట్‌గా సేవలందించిన మురాలశెట్టి రామకృష్ణ పదవీ విరమణ పొందారు.

ఈ సందర్భంగా దేవస్థానశీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ ఐ.వి. రోహిత్, కార్యనిర్వహణ అధికారి (ఈఓ) నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు.

ఈ సందర్భంగా చైర్మన్, ఈఓ మాట్లాడుతూ.. దేవస్థానంలో తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, భక్తుల సేవలో ముగ్గురు ఉద్యోగులు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేవస్థాన అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం వారి జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని, వారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. శ్రీ సత్యదేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ వారికి, వారి కుటుంబ సభ్యులకు ఉండాలని కోరుకున్నారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానశీ పాలకమండలి సభ్యులు పర్వత సూర్యారావు (సురేష్), కామర్స్ చిరంజీవి, వివిధ విభాగాల అధికారులు, అర్చకస్వాములు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

## కళారాధన డాన్స్ అకాడమీ పోటీలలో ఏలేశ్వరం విద్యార్థినుల ప్రతిభ.






**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 31:** కళారాధన డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కాంపిటీషన్ పోటీల్లో ఏలేశ్వరం విద్యార్థినులు కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనపర్చారు. కళారాధన డాన్స్ అకాడమీ ఆదివారం హైదరాబాదులో నిర్వహించిన భరతనాట్యం పోటీల్లో ఏలేశ్వరం జగ్గంపేట విద్యార్థులు తమ డాన్స్ ప్రదర్శనతో అలరించి బహుమతులు పొందారు. ఈ సందర్భంగా కూచిపూడి డ్యాన్స్ టీచర్ ముళ్ళపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ అంతరించిపోతున్న భరతనాట్య కళకు జీవం పోయాలని ఆకాంక్షతో డాన్స్ నేర్చుకోవడం తో పాటు ఏలేశ్వరం జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో విద్యార్థులకు భరతనాట్యంలో ప్రావీణ్యత పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. విద్య నేర్పే గురువుకి మంచి శిష్యులు దొరకడం దైవానుగ్రహంగా భావిస్తున్నామని అలాగే విద్యార్థులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కూచిపూడి డాన్స్ అకాడమీ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకున్న ఏలేశ్వరానికి చెందిన గంగిరెడ్ల కుందనార్షిత, గంగిరెడ్ల వేదాంశ, గాధవరుల సంహిత, గాథావరులు సహస్ర, జగ్గంపేటకు చెందిన మామిళ్ళపల్లి గాయత్రి, ఐశ్వర్య, యడ్లపల్లి సత్య ప్రవీణ, ఎం తనూజ, చిన్మయి, గగన సింధు కుమారి, గుషిత, గౌరీ శ్రావికలు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రతిభ చూపిన డాన్స్ విద్యార్థులను ఏలేశ్వరం లో మండల వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురోహిత సభ్యులు వేద మంత్రాలతో సోమవారం చిన్నారులను ఆశీర్వదించి, నృత్య కళాకారిణి ముళ్ళపూడి విజయలక్ష్మికి అభినందనలు తెలిపారు.

## పంట నీరు అందని రైతులు ఆరుతడి పంటలు వేసికోవాలి.



- రైతులకు 80 శాతం రాయితీపై మినుము విత్తనాలు.
- మండల వ్యవసాయ శాఖ అధికారిని జోకా అమృత.



**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు, 31:** ప్రత్తిపాడు మండలం పెద్ది పాలెం,గోకవరం,ఉత్తరకంచి గ్రామాల్లో వరి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత పరిశీలించారు. ఈ సందర్భంగా పంట పరిస్థితులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి సాగుకు తగినంత నీటి వసతి లేని రైతులు తక్కువ కాలపరిమితి కలిగిన ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. వరి సాగుకు సరిపడా నీరు అందుబాటులో లేని రైతులకు 80 శాతం రాయితీపై మినుము విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే పీఎండీఎస్ విత్తనాలను పొలంలో జల్లుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారిణి జోకాఅమృత,వ్యవసాయ శాఖ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా పదవి విరమణ సన్మానం



**అల్లవరం, పెన్ పవర్, ఆగస్టు 31:** తూర్పులంక జడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్)గా 40 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించి సోమవారం పదవీ విరమణ పొందిన కేదాశి సత్యనారాయణ పదవీ విరమణ సభ పాఠశాల ఆవరణలో అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్.వి.ఎస్. సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు సత్యనారాయణ 40 ఏళ్ల ఉపాధ్యాయ జీవితాన్ని కొనియాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేయడమే కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందిస్తూ ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలిచారని ప్రశంసించారు. సందర్భంగా కేదాశి సత్యనారాయణ, వారి సతీమణి బి. శాంతారత్నం ని దుశ్శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విచ్చేసిన అతిథులు, బంధువులు, స్నేహితులు, విద్యార్థులకు సత్యనారాయణ విందు ఏర్పాటు చేయడంతో పాటు జ్ఞాపకంగా బ్యాగులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో అల్లవరం ఎంపీపీ యిళ్ళ శేషగిరిరావు, జడ్పిటిసి సభ్యురాలు కొనుకు గౌతమి మహేష్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె. వెంకటేశ్వరరావు, ఎంఈవోలు కె. కిరణ్ బాబు, సానబోయిన ఏడుకొండలు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ శ్రీమతి జల్లి దుర్గ,మాజీ సర్పంచ్ గంగాజలం, లాయర్ ప్రసాద్, కో-ఆప్టెడ్ సభ్యులు, ఎస్ఎంసీ సభ్యులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు సిబ్బందికి ఘన సత్కారం



**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 31 :** పోలీసు శాఖలో సుదీర్ఘకాలం అంకితభావంతో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఘనంగా సత్కరించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పదవీ విరమణ పొందిన వారిలో డీఏఆర్ విభాగం ఏఆర్ ఎస్ఐ ఎన్.రాంబాబు,ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ ఏఎస్సై ఎం.వాడపల్లి, ట్రాఫిక్-1 పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కె. నాగేశ్వరరావు,మూడో పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.సి.హెచ్. వీరయ్య ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో వారు అందించిన సేవలు, అంకితభావం అభినందనీయమని కొనియాడారు.

పదవీ విరమణ అనంతరం వారి జీవితం ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరావు,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.వి.వి.సత్యనారాయణమూర్తి,సీసీ ఎస్.రాంబాబు,జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యమూర్తి,ఎగ్జిక్యూటివ్ మెంబర్ కోమలి దుర్గాదేవి,మెంబర్ గంగేశ్వరి, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 15 ఏళ్లకే సంచలనం.. దులీప్ ట్రోఫీలో 57 ఏళ్ల రికార్డు బద్దలుకొట్టిన వైభవ్ సూర్యవంశీ

**15 ఏళ్ల 175 రోజులకే హాఫ్ సెంచరీ సాధించి చరిత్ర సృష్టించిన యువ బ్యాటర్**

**సెంట్రల్ జోన్‌పై కేవలం 42 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి**

**గత మ్యాచ్‌లో బౌలర్‌గా రాణించిన యువ సంచలనం**

**తాజా మ్యాచ్‌లో కెప్టెన్సీ కూడా నిర్వహణ**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత దేశవాళీ క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రికార్డుల మోత మోగిస్తున్నాడు. తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ఇప్పటికే పలుమార్లు వార్తల్లో నిలిచిన ఈ కుర్రాడు, తాజాగా మరోసారి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. బెంగళూరు వేదికగా సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ 2026 సెమీఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తరపున ఆడుతూ అరుదైన ఘనత సాధించాడు. కేవలం 15 ఏళ్ల 175 రోజుల వయసులో హాఫ్ సెంచరీ చేసి, 57 ఏళ్ల సుదీర్ఘ రికార్డును బద్దలుకొట్టాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్, ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. కేవలం 42 బంతుల్లోనే సిక్సర్ బాది తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. తద్వారా దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యంత పిన్న వయసులో హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇంతకుముందు ఈ రికార్డు 1969లో లక్ష్మణ్ సింగ్ పేరిట ఉండేది. అప్పుడు ఆయన 16 ఏళ్ల 23 రోజుల వయసులో ఈ ఘనత సాధించారు. ఇప్పుడు వైభవ్ ఆ రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో పియూష్ చావ్లా (16 ఏళ్ల 307 రోజులు) మూడో స్థానంలో ఉన్నాడు.

**బ్యాటింగే కాదు, కెప్టెన్సీ కూడా..**

ఈ మ్యాచ్ తొలి రోజు ఆటలో వైభవ్ తన నాయకత్వ పటిమను కూడా ప్రదర్శించాడు. ఈస్ట్ జోన్ రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ కుడి చేతి మణికట్టుకు గాయం కావడంతో మైదానం వీడాల్సి వచ్చింది. ఆ సమయంలో సుమారు గంటపాటు వైభవ్ జట్టుకు తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు.

**ఆల్‌రౌండ్ నైపుణ్యం**

క్వార్టర్‌ఫైనల్‌లో నార్త్ ఈస్ట్ జోన్‌పై బ్యాటింగ్‌లో విఫలమైనప్పటికీ, వైభవ్ తన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌తో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆ మ్యాచ్‌లో కేవలం మూడు ఓవర్లు బౌలింగ్ చేసి 11 పరుగులిచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. తన బౌలింగ్ గురించి బీసీసీఐ పంచుకున్న వీడియోలో వైభవ్ మాట్లాడుతూ.. "ఏ బ్యాటర్‌ను అడిగినా బౌలింగ్ చేయడం కూడా ఆస్వాదిస్తారు. వికెట్లు పడని సమయంలో ఇషాన్ భయ్యా నన్ను 2-3 ఓవర్లు వేయమన్నారు. నాతో బౌలింగ్ చేయించడం కొంత రిస్క్ అని భావించారు, కానీ నేను వికెట్లు తీయగలనని అతనికి తెలియదు" అని నవ్వుతూ చెప్పాడు. "నాకు తక్కువ ఓవర్లే దొరుకుతాయని తెలుసు. అందుకే నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి, ఒకే స్పాట్‌లో బంతులు వేయడానికి ప్రయత్నించాను" అని తన ఆలోచనా విధానాన్ని వివరించాడు. మొత్తంగా బ్యాటింగ్, బౌలింగ్, కెప్టెన్సీతో వైభవ్ సూర్యవంశీ భారత క్రికెట్‌లో భవిష్యత్ తారగా ఎదుగుతున్నాడు.

# బెల్జియం చేతిలో ఓడిన భారత్.. హాకీ వరల్డ్ కప్‌లో ఎనిమిదో స్థానంతో సరి



**హైదరాబాద్ పెన్ పవర్:** హాకీ వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్‌లో భారత్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. శుక్రవారం వావ్రేలోని బెల్ఫియస్ హాకీ అరెనాలో జరిగిన హోరాహోరీ పోరులో ఆతిథ్య బెల్జియం జట్టు షూటౌట్‌లో 4--3 తేడాతో భారత్‌పై విజయం సాధించింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరు జట్లు 3--3తో సమంగా నిలవడంతో విజేతను తేల్చేందుకు షూటౌట్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. చివరి క్షణంలో భారత జట్టు సాధించిన అద్భుతమైన గోల్‌తో మ్యాచ్ షూటౌట్‌కు దారితీసింది. ఈ టోర్నమెంట్‌లో భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మొత్తం ఎనిమిది గోల్స్‌తో మెరిశాడు. అర్జెంటీనా ఆటగాడు డోమెనెతో కలిసి ఆయన టాప్ స్కోరర్ల జాబితాలో నిలిచాడు.

**ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్..**

శుక్రవారం నాటి పోరులో అభిషేక్ గోల్ కొట్టి భారత్‌కు శుభారంభం అందించాడు. మన్‌ప్రీత్ సింగ్ అందించిన పాస్‌ను అభిషేక్ షాట్‌తో బెల్జియం గోల్‌కీపర్ వాన్ష్‌ను దాటించి గోల్ సాధించాడు. రెండో క్వార్టర్‌లో బెల్జియం వరుసగా 2 గోల్స్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రొమాన్ డువెక్స్లాట్(22వ నిమిషం), హ్యూగో లాబోచరే (23వ నిమిషం) గోల్స్ చేసి ఆతిథ్య జట్టుకు 2-1 ఆధిక్యాన్ని అందించారు. ద్వితీయార్ధం ప్రారంభమైన వెంటనే భారత్ కౌంటర్ అటాక్ చేసింది.

హర్మన్‌ప్రీత్ పెనాల్టీ కార్నర్‌ను అద్భుతమైన డ్రాగ్-ఫ్లిక్‌తో గోల్‌గా మలచి స్కోరును 2---2తో సమం చేశాడు. నాలుగో క్వార్టర్‌లో బెల్జియం ఆటగాడు నికోలస్ డి కెర్పెల్ మరో గోల్ సాధించి స్కోర్‌ను 3-3కి చేర్చాడు. మ్యాచ్ ముగియడానికి 26 సెకన్లుండగా భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి గోల్ కొట్టి స్కోరును 3-3తో సమం చేయడంతో మ్యాచ్ షూటౌట్‌కు దారితీసింది.

**షూటౌట్‌లో తలవంచిన భారత్..**

బెల్జియం తరపున టామ్ బూన్, ఆర్థర్ డి స్లూవర్, అలెజాండ్రిక్ హెండ్రిక్స్, రొమాన్ డువెక్స్లాట్ గోల్స్ సాధించి తమ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ ఓటమితో ప్రపంచ కప్‌లో భారత్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకోగా, ఆతిథ్య బెల్జియం ఏడో స్థానాన్ని కైవసం చేసుకుంది.

# 2027 వన్డే వరల్డ్ కప్ ప్లాన్‌లో తిలక్.. శ్రేయస్‌కు టెన్షన్





**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని టీమ్‌ఇండియా ఇప్పటి నుంచే జట్టు కూర్పుపై కసరత్తు చేస్తోంది. నంబర్-4లో కీలకంగా ఉన్న శ్రేయస్ అయ్యర్‌కు ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ యువ బ్యాటర్ తిలక్ వర్మను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కొత్త కాంబినేషన్‌పై ఫోకస్ పెట్టినట్లు సమాచారం. దక్షిణాఫ్రికా బౌన్సీ పిచ్‌లపై శ్రేయస్ ప్రదర్శన, ఫిట్‌నెస్, ఫీల్డింగ్ అంశాలను మేనేజ్‌మెంట్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు టాప్-6లో లెఫ్ట్‌హ్యాండర్ లేకపోవడంతో తిలక్‌కు అదనపు అడ్వాంటేజ్ ఉంది. హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి గాయాల నేపథ్యంలో తిలక్ తన ఆఫ్‌స్పిన్‌ను కూడా మెరుగుపరుచుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ సూచించినట్లు సమాచారం. తిలక్ భారత్ తరపున 59 టీ20లు, 5 వన్డేలు ఆడాడు. దేశవాళీ లిస్ట్-ఏలో 52 మ్యాచ్‌ల్లో 2,142 పరుగులు, 6 సెంచరీలతో 47.60 సగటు నమోదు చేశాడు. అక్టోబర్ న్యూజిలాండ్ వన్డే సిరీస్ నుంచే వరల్డ్‌కప్ ప్రణాళికలు అమలు చేసే అవకాశం ఉంది.



# వందల కోట్లు ఎందుకు దండగ? AI 'రామాయణం'తో కన్నుల పండగ!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికత సినీ ప్రపంచంలో సరికొత్త విప్లవాన్ని తీసుకొస్తోంది. భారీ బడ్జెట్‌లతో ఏళ్ల తరబడి సినిమాలు తీసే విధానానికి ప్రత్యామ్నాయంగా (AI)సాయంతో రూపొందించిన ఫ్యాన్ మేడ్ విజువల్స్, సినిమాలు అద్భుతం అంటూ ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇప్పుడు ఏకంగా 'రామాయణం' కాన్సెప్ట్ మూవీని తీర్చిదిద్దిన తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో విపరీతంగా ఆకట్టుకుంటోంది. "వందల కోట్లు ఎందుకు దండగ" అనేలా రూపుదిద్దుకున్న ఈ విజువల్స్ సినీ ప్రియులను ఆశ్చర్యపరుస్తున్నాయి. నితీష్ తివారీ లాంటి దర్శకులు 'రామాయణం' ప్రాజెక్ట్ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతుంటే.. ఈ (AI) క్రియేటర్లు కేవలం కొన్ని గంటలు లేదా రోజుల్లోనే అత్యంత అద్భుతమైన విజువల్ గ్రాండియర్ దృశ్యాన్ని ఆవిష్కరించి బ్రిలియెన్సీని చాటుకున్నారు. ఆర్టిస్టులు, టెక్నీషియన్లు అంటూ వందల మందికి పేమెంట్లు ఇచ్చే పని లేకుండా పనైపోతోంది. రామాయణం ఏఐ టీజర్‌లో ముఖ్యంగా టాలీవుడ్ దిగ్గజ స్టార్ కాస్టింగ్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. సినిమా ఆద్యంతం ప్రిన్స్ మహేష్ బాబు శ్రీరాముడి పాత్రలో కాంతివంతమైన-దివ్యమైన లుక్‌తో కనిపిస్తే... మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లక్ష్మణుడి పాత్రలో ఎంతో పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఇక లంకాధిపతి రావణాసురుడిగా మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ ని చూపించిన తీరు మెస్మరైజ్ చేస్తోంది. భయానక మాయావి అయిన రాక్షసుడిగా అతడి అభినయం, వైఖరి - గంభీరమైన స్ఫురద్రూపం ఈ టీజర్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. నితీష్ రామాయణం టీజర్‌తో యష్ కి వచ్చినంత పేరు ఇక్కడ ఎన్టీఆర్‌కి వచ్చింది. వీరితో పాటు సీతాదేవిగా కీర్తి సురేష్, ఊర్మిళగా శ్రీలీల, మండోదరిగా జాన్వీ కపూర్ తమ ప్రశాంతమైన, సౌందర్యవంతమైన రూపాలతో అలరించారు. ఇక దశరథ మహారాజు పాత్రలో నందమూరి బాలకృష్ణ రాజసంతో కూడిన గంభీరమైన లుక్‌లో కనిపించి టీజర్‌కు మరింత మైలేజ్ తెచ్చారు. ఈ నటీనటులందరినీ ఏఐ సాయంతో పర్ఫెక్ట్ రామాయణ పాత్రలుగా మలచిన తీరు వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ కాన్సెప్ట్ టీజర్‌లో భావోద్వేగాలు, యుద్ధ సన్నివేశాలను ఎంతో గ్రాండ్‌గా డిజైన్ చేశారు. తండ్రి దశరథుడి వద్ద శ్రీరాముడు వీడ్కోలు తీసుకునే సన్నివేశాలు... వనవాసానికి ప్రయాణమయ్యే దృశ్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అలాగే లంకలో రావణాసురుడి సన్నివేశాలతో పాటు వానర సేన, రాక్షస సేనల మధ్య సాగే భారీ యుద్ధ ఘట్టాలు, రామ్-లక్ష్మణుల వీరోచిత బాణప్రయోగాలు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో డిజైన్ చేయబడ్డాయి. ఏలాంటి డైలాగులతో పని లేకుండా.. కేవలం ఒక శక్తివంతమైన థీమ్ మ్యూజిక్‌ను మాత్రమే ఉపయోగిస్తూ కథను నడిపించిన తీరు టీజర్ స్థాయిని పెంచింది. మాటలవసరం లేకుండా విజువల్స్, నేపథ్య సంగీతంతోనే రామాయణ కావ్యంలోని పవిత్రతను, ఘనతను ఆవిష్కరించడం విశేషం. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సినిమా రంగాన్ని ఎంతటి అద్భుతమైన మలుపులు తిప్పబోతోందో చెప్పడానికి ఈ ఫ్యాన్ మేడ్ -రామాయణ- టీజర్ ఒక ఉదాహరణగా నిలిచింది.



**సినిమా నిర్మాణంలో సరికొత్త శకానికి నాంది:**

సినిమా నిర్మాణం అంటేనే భారీ బడ్జెట్లు, ఎండ్-లెస్ లొకేషన్ల వేట, కాస్ట్యూమ్స్, మేకప్, కారవాన్ల హడావుడి, స్టార్ ఆర్టిస్టుల కాల్షీట్ల సమస్యలు, ఖరీదైన టెక్నీషియన్లు , కెమెరా డిపార్ట్‌మెంట్లతో కూడిన సుదీర్ఘమైన షెడ్యూళ్లు. రోజులు తరబడి నటీనటుల కోసం ఎదురుచూడటం.. కోట్లాది రూపాయల ఖర్చుతో సెట్స్ వేయడం వంటివన్నీ సాంప్రదాయ సినిమా మేకింగ్‌లో భాగం. కానీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) అందుబాటులోకి వచ్చాక ఈ శ్రమ, సమయం , ఖర్చులన్నీ ఒక్కసారిగా తగ్గిపోయాయి. ఎటువంటి లైవ్ సెట్స్... హడావుడి లేకుండా కేవలం కంప్యూటర్ స్క్రీన్ ముందే అనుకున్న కాన్సెప్ట్‌ను అత్యున్నత దృశ్యకావ్యంగా మలచడం సాధ్యమవుతోంది. ప్రస్తుతం ఏఐ ప్రారంభ దశలోనే విజువల్స్.. నటీనటుల రూపాలు.. యుద్ధ ఘట్టాలను ఇంత అద్భుతంగా, సులువుగా ఆవిష్కరిస్తూ గొప్ప మ్యాజిక్ చేస్తోంది. కాన్సెప్ట్ టీజర్లు - గ్రాఫిక్స్ విషయంలో ఏఐ సాధిస్తున్న ఈ పురోగతిని చూస్తుంటే మునుముందు -ఆర్గానిక్ ఇంటెలిజెన్స్- (AI)లేదా మరింత అధునాతన ఏఐ సాంకేతికత వస్తే చలనచిత్ర రంగం ఏ స్థాయికి చేరుకుంటుందో ఊహించడం కూడా కష్టమే. భవిష్యత్తులో సాంకేతికత మరింత పరిణతి చెందితే.. భారీ బడ్జెట్ల అవసరం లేకుండా ప్రతీ ఒక్కరి ఆలోచనలు అత్యుత్తమ దృశ్యరూపాలుగా మారి సినిమా నిర్మాణంలో సరికొత్త శకానికి నాంది పలకడం ఖాయం. ఏఐ సినిమాలు చూడలేం అంటూనే గంటల తరబడి ఇప్పుడు కంప్యూటర్లలో యూత్ వాటిని వీక్షిస్తూనే ఉండటాన్ని గమనించాల్సి ఉంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com